# చేసుకున్నవాడికి చేసుకున్నంత

రాంబాబుకి పెళ్ళయింది. కొత్త కాపురం, కొత్త భార్య (అంటే వేరే పాత భార్య వుందని కాదండోయ్) ఓహో హుషారుగా వెలిగిపోయాడు. తరచుగా ఆఫీస్‌కి శెలవు పెట్టేసి, విహారాలతో గడిపేశాడు. భార్య దివి నుంచి భువికి దిగివచ్చిన అప్సరసలా బ్యూటీ క్వీన్‌లా కనబడేది. ఆవిడ మాట్లాడితే వీణలు మ్రోగినట్టూ, నవ్వితే గంపెడు పారిజాతాలు కురిసినట్టూ, నడిస్తే నెమళ్ళు నడిచినట్టూ వుండేది.

ఆమె పేరు సుబ్బలక్ష్మి. పాతకాలం పేరును మోడరేట్ చేసి 'శుభ' అని ముద్దుగా పిల్చుకునేవాడు. మరింక శుభ వంట చేసిందంటే (అప్పుడప్పుడు మాత్రమే చేస్తుందని కాదు. పాపం రోజూ చేస్తుందిలెండి) ఏ ఫైవ్ స్టార్ హోటల్లో పదార్థాలూ వుండనంత రుచిగా వుంటాయి అనేవాడు. బ్రహ్మచారులైన ఫ్రెండ్స్‌ని తరచుగా, భోజనాలకి ఆహ్వానించి, 'అబ్బ మనక్కూడా ఇలా వంటచేసి పెట్టే భార్య దొరికితే బాగుండును' అని, వాళ్ళు అనుకుంటుంటే గర్వపడేవాడు.

కొన్నాళ్లు గడిచింది. సుబ్బలక్ష్మి ఇద్దరు పిల్లల తల్లయింది. ఇప్పుడు రాంబాబు, భార్యని శుభా అనడం మరచిపోయాడు. 'సుబ్బా' అని పిలుస్తున్నాడు. "పిల్లలు ఎటైనా వెడదాం అంటున్నారు. ఒక్కరోజు శెలవు పెట్టండి..." భార్య ముచ్చటగా అడిగితే, 'ఆఫీస్‌లో ఇన్‌స్పెక్షన్ వుంది. ఒక్క రోజేంటి, గంట పర్మిషన్ కూడా దొరకదు' అంటున్నాడు, తప్పించుకోడానికి.

ఆమె ఏదైనా సంసార విషయం చెప్పబోతే 'అబ్బబ్బ ఆఫీస్లో చచ్చేంత చాకిరీ చేసి వచ్చాను. వెధవ గోలతో, పూర్తిగా నా ప్రాణాలు తీయకు' అంటూ విసుక్కుంటున్నాడు.

ఆమె ఆనందంగా ఎప్పుడైనా నవ్వితే, "ఏమిటా వెధవనవ్వు? సమయం సందర్భం లేకుండా! నాకసలే చిరాగ్గా వుంది" అంటాడు.

ఒకప్పుడు అప్సరసలా కనిపించిన సుబ్బలక్ష్మి, బ్యూటీ క్వీన్‌లా కనిపించిన శుభా, ఇప్పుడు అందవికారంగా కనిపిస్తోంది.


నాడు భోజనం చేస్తూ, 'నీ చేతి వంట ముందు, ఏ ఫైవ్ స్టార్ హోటల్ పదార్థాలైనా బలాదూర్' అని పొగిడే నోటితోనే, 'ఛీ ఈ కూర మనుషులు తినడానికా, రాక్షసులు తినడానికా?' అని ఈనాడు పేర్లు పెడుతున్నాడు.

సుబ్బలక్ష్మి చూసింది చూసింది. 'ఏం ఎందు కంత విసుక్కోవాలి? ఆఫీస్‌లో పని ఎక్కువైతే, నాకు పిల్లలతో ఇంటిపని ఎక్కువ అవలేదా? నేను ఒక్కరోజు అయినా విసుక్కున్నానా? కొత్తలో కనిపించినట్టు అందంగా అలంకరించుకోక పోయినా, మరీ జిడ్డులా వుండటం నా పద్ధతి కానేకాదు. ఇంకా ఆయనే మందు అలవాటుతో పొట్టవచ్చి, నడుస్తుంటే గున్నఏనుగు నడిచి నట్టుంటుంది. పిల్లలు ఏడుస్తున్నారని, మిమ్మల్ని ఎక్కడికైనా రమ్మంటున్నాను గానీ, హాయిగా నేను ఒక్కదాన్నే తీసుకెడతాను. ఏమిటో మనుషులు కొన్నాళ్ళకి ఇలా ఎందుకు మారిపోతారో?' అనుకుని బాధపడింది సుబ్బలక్ష్మి.

ఓసారి ఫ్రెండ్‌ని అడిగింది. "తులసీ! మీ ఆయనగారు కూడా ఇలాగే అంటారా? లేక నాకు మాత్రమే పట్టిన దురదృష్టమా - ఇది" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"శుభా- కాదు లక్ష్మీ... నీ పేరు మార్చాక మాకు మారిన పేరే అలవాటు అయిపోయింది. పాత పేరు మరిచేపోయాం! అందరూ రాంబాబులా వుంటారా వుండరా అనేది అలా వుంచు. ముందు అతడిలో మార్పు రావాలి. మళ్ళీ మామూలు మనిషిలా వుండాలి. అంతేకదా నీక్కావలసింది. నువ్వేం బాధపడకు. నేనో ప్లాన్ వేస్తాను. చూద్దాం. రాంబాబులో మార్పు రావచ్చు" అంటూ ధైర్యం చెప్పింది.

రాంబాబుకి, తులసీ, మధూలు తెలుసు. ఒకప్పుడు వాళ్ళ ఇంటికి తరచు వెళ్ళడం, వాళ్ళు రావడం జరిగేది. సుబ్బలక్ష్మిని నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టాక తులసి వాళ్ళ ఇంటికి వెళ్ళడం



మానేశాడు.

పాప బర్త్‌డేకి తులసి, మధులను భోజనానికి పిలిచింది సుబ్బలక్ష్మి. మధు వస్తూనే, సుబ్బలక్ష్మిని పొగడ్తలతో ముంచెత్తాడు. "లక్ష్మిగారూ! 'ఇల్లు చూడు ఇల్లాల్ని చూడు' అనేది పాత సామెత. నేనైతే 'లక్ష్మిగార్ని చూస్తే ఇల్లెలా వుంటుందో వేరే చెప్పనక్కర్లేదంటాను.' ఇక పిల్లలిద్దరి పెంపకం చూస్తే ముచ్చటేస్తుందండి. ఏం డిసిప్లిన్ హబ్బ... రాంబాబూ! మీరు చాలా లక్కీ ఫెలో అండీ. మీ అబ్బాయికి మార్కులు ఇంత బాగా వచ్చాయంటే, అంతా మదర్ శ్రద్ధ తీసుకోవడం వల్లనే!"

ఇక భోజనం దగ్గిర ఒక్కో పదార్థాన్ని తెగ మెచ్చేసుకున్నాడు. అలా అని తులసిని తక్కువచేసి

హేళనగా మాట్లాడనూ లేదు.

తులసీ! నీకో ప్రత్యేక పద్ధతి వున్నట్టే, లక్ష్మి గారిలోనూ ప్రత్యేకత వుంది. నువ్వేమీ అనుకోనంటే నేనో మాట చెప్పనా?

మంచి అలవాట్లు, పద్ధతులూ ఒకరి దగ్గర మరొకరు నేర్చుకోవడంలో తప్పు లేదు. చూడు. ఈ డెకరేషన్ నువ్వు నేర్చుకో. మనింట్లో కూడా, కొంచెం మార్పు చెయ్!

"రాంబాబూ! ఏమిటోయ్ చాలా రోజులైంది. మా ఇంటికి వచ్చి! ఎంత ఆఫీస్ వర్క్‌తో బిజీ అయినా, అప్పుడప్పుడు రిలాక్స్ అవుతూండటం అవసరం. అప్పుడు రెట్టింపు పని చేయగలుగుతాం. మనం పాత స్నేహితులమే! వస్తూండండి!" అంటూ వున్నంతసేపూ, ఒకటే సందడి చేశాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక, రాంబాబు, "ఏమిటిదీ ఆ మధు నిన్ను ఒకటే పొగడటం మొదలు పెట్టాడు? ఎంత పరిచయం వుంటే మాత్రం పరాయి స్త్రీని అంతలా, ఆకాశానికి ఎత్తేయాలా? మానర్స్ లేదు" అన్నాడు భార్యనుద్దేశించి.

## యువన కవనం

**నా** యవ్వన ప్రారంభంలో
నీ ఊసే నా ఊహ
నా ఊహల రంగుల కలకు
రంగవల్లి నీ నగవు
నా ప్రేమ సంద్రానికి తెరచాపే
నా హొయలు
నా కల చెదిరింది
కలత మొదలైంది!
నా విషాద గీతికలో నిషిది
నీ కురుల నీడలే
నా జీవన చరమాంకంలో
బడబాగ్నే నీ నటన
నా ముదిమి ప్రార్బదంలో
సుడిగాలీ నీ విరి తూపులు
రాలుగాయి అతివ నవ్వుకే
రాలింది ఓ అడవి పువ్వు

-అల్లం సుధాకర్

సుబ్బలక్ష్మి మాట్లాడలేదు కానీ, భర్త కడుపు మంట ఎందుకో అర్థమైంది! మధు, తులసి 'సత్యన్నారాయణ వ్రతం చేసుకుంటున్నాం మా ఇంటికి భోజనానికి రండ'ని పిలిచారు ఓ ఆదివారం.

"నువ్వూ పిల్లలూ వెళ్ళండి నేను రాను" అన్నాడు రాంబాబు.

సుబ్బలక్ష్మి, పిల్లల్ని తయారుచేసి, వెళ్ళడానికి సిద్ధం అవుతూంటే, మధు వచ్చాడు. "రాంబాబూ! ఏమిటిదీ మీరింకా ఇలాగే వున్నారు? వ్రతం అయిపోయింది. మీకోసమే వెయిట్ చేస్తున్నాం. నాకిటువైపు పని వుండి వచ్చాను. పదండి ఏకంగా కలిసే వెడదాం" అంటూ చెప్పడంతో, రాంబాబుకి బయలుదేరక తప్పలేదు. వాళ్ళ కుటుంబం, వీళ్ళ కుటుంబం తప్ప, ఎవరూ పైవాళ్ళు లేరు. పిల్లలు భోజనాలు చేసి ఆడుకుంటూంటే, పెద్దవాళ్ళు భోజనానికి కూర్చున్నారు.

రాంబాబూ! మీరు నమ్ముతారో లేదో, తులసిని నేను మొదట చూసినప్పుడు ఇష్టపడలేదు. కానీ ఆవిడగారు నన్నే చేసుకుంటానని, నిరసన దీక్ష పట్టింది. అయితే నాకేం? నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో అన్నాను.

'మీరు ఇష్టపడకపోతే నేను పెళ్ళే చేసుకోను' అంది.

'మానేయ్! నాకేమీ జాల్లేదు' అన్నాను.

అయినా పట్టు విడవలేదు తులసి. విచిత్రం, ఆతర్వాత న్నాకు పెళ్ళి సంబంధాలు రానేలేదు. అమ్మా నాన్న ఏడ్చి గోలపెట్టి, 'తులసితో నీకు రాసి పెట్టి వుంది. ఒప్పుకో. చూశావుగా మరో సంబంధం రానేలేదు' అన్నారు.

నిజంగానే సంవత్సరం పాటు నేను మాట్లాడలేదు. చివరికి 'ఎస్' అన్నాననుకోండి. అంటూ చెప్పినప్పుడు, రాంబాబు అన్నాడు.

"మరి ఇష్టంలేని పెళ్ళి చేసుకుని ఎలా సంతోషంగా వుంటున్నారు?"

"అదేనండీ మరి. తులసిలో స్పెషాలిటీ. నన్ను ఎంతగా ఇష్టపడిందో, పెళ్ళి అయ్యాకనే తెలిసింది. చాలారోజులు నేను ఆవిడతో అయిష్టంగానే వున్నాను. సరిగా మాట్లాడలేదు. ఎక్కడికీ

తీసుకెళ్ళలేదు. భోజనం కూడా బయట హోటల్లో తినేవాణ్ణి. అసలామెను పట్టించుకోలేదు. అయినా నన్నేమీ అన్లేదు. సహనంతో ఎదురుచూసింది. చివరికి నాలో మార్పు తీసుకువచ్చింది" అన్నాడు.

ఇక భోజనం చేస్తూ ప్రతి వంటకం సరే, చివరగా పెరుగు తోడు పెట్టడంలో కూడా తన భార్య పద్ధతే వేరన్నాడు. ఆ పెరుగు పులుపు లేకుండా పాలు ఎలా కాచి తోడు పెట్టిందో, ఒకటే వర్ణిస్తూ మెచ్చుకోవడం.

రాంబాబుకి 'మధు నిజంగానే తులసిని మెచ్చుకుంటున్నాడా, లేక ఇదేమన్నా డ్రామాయా?' అనిపించింది. తెలిసిన మధూ వాళ్ళ బంధువును అడిగాడు.

"మధూ, తులసి ఎప్పుడూ పోట్లాడుకుంటారు. భార్యంటే అతగాడికి ఇష్టం లేదనుకుంటా మా ఎదురుగానే చీదరించుకోవడం, తిట్టడం, అవమానించడం, చిన్నబుచ్చడం చూసేను. పాపం తులసంటే నాకు జాలి వేస్తోంది" అని.

"భలేవారండీ రాంబాబూ! వాళ్ళిద్దరూ చాలా అన్యోన్యంగా వుంటారు. మీరెందుకిలా చెబుతున్నారో తెలియదు. అసలు మీరెప్పుడూ వాళ్ళ గురించి చెడుగా చెప్పకండి. నాకు నచ్చదు" అనేశాడు.

అయితే కరక్టేనన్నమాట! ఇష్టంలేని భార్యని, ఇంతగా ఇప్పుడు ఇష్టపడుతున్నాడంటే, మధు నా కంటే గొప్పవాడయినా అయి వుండాలి. లేదా తులసి మంచి మనిషై వుండాలి.

నేను సుబ్బలక్ష్మిని అన్నివిధాలా నచ్చే పెళ్ళి చేసుకున్నాను. మనిషిలో మార్పు సహజం. అంతమాత్రాన నిర్లక్ష్యం చేయడం చాలా తప్పు. అయినా, నేను అలాగే వుండిపోయానా? అనుకుని అద్దంలో పరిశీలనగా చూసుకున్నాడు రాంబాబు.

"అసలు ఎప్పుడయినా నీ మొహం అద్దంలో చూసుకున్నావా" అని ఎందుకు అంటుంటారో అర్థమైంది అతడికి. ఒక్కసారి వులిక్కిపడ్డాడు. ఏదో ఆఫీసుకెళ్ళే హడావిడిలో ఆదరాబాదరా తల దువ్వుకుని, డ్రస్ చేసుకుని వెళ్ళిపోతున్నాను. డ్రస్‌లన్నీ టైట్ అయిపోయాయి. పొట్ట ముందు కొచ్చి అసహ్యంగా వుంది. ఇంత లావు కళ్ళద్దాలు వేయించుకుని చాలా రోజులైంది. పళ్ళు కూడా నొప్పిగా వున్నాయి. కొత్తవి కట్టించుకుని, అవకాశాన్ని మరుగు చేసుకోవచ్చు. కానీ మొదట్లో వున్న దృఢత్వం తగ్గినట్టే కదా? ఇలాగే శారీరకమైన మార్పులు వుండచ్చు. పాపం సుబ్బలక్ష్మిని ఎంత బాధపెట్టాను? తులసి కంటే వేయి రెట్లు అణకువ, అందం గల సుబ్బలక్ష్మిని చీదరించుకుని పేద్ద నేనేదో అమృతం తాగిన దేవతా కుమారుడిలా ఫోజు కొట్టాను" అనుకుని పశ్చాత్తాపుడిపోయాడు.

వెంటనే ప్లేటు ఫిరాయించి, సుబ్బలక్ష్మితో మునుపటిలా వుండాలనీ, నిజానికి ఆమె ముందు తనే తీసికట్టుగా వున్నానని గ్రహించుకుని, లూజ్‌గా వున్న కొత్త డ్రస్ కొనుక్కొని, పైపై మెరుగులు దిద్దుకుని "శుభా! వారం రోజులు శెలవు తీసుకున్నాను. అలా ఎట్లైనా వెళ్ళొద్దామా?" అన్నాడు ప్రేమగా!

"బాబుకి స్కూలు పోతుంది. ఇప్పుడు విహారాలేమిటి? సెలవలిచ్చాక చూద్దాం" అంది సుబ్బలక్ష్మి.

నిజానికి అప్పటికే సుబ్బలక్ష్మి మనసు విరిగిపోయింది. రోజుకోలా రంగులు మార్చే మనిషిని నమ్మకూడదు. ఎవరినో చూసి, ఎవర్నో అనుకరించడం ఏమిటి? ఏదో ఆ టైమ్‌లో తులసి దగ్గర బయటపడిపోయాను. నా వ్యక్తిత్వం ఏమైపోయింది! ఏం. భర్త తన ఇష్టం వచ్చినట్టు మూడ్స్ మార్చుకోవచ్చా? దానికి అనుగుణంగా నేను మారిపోవాలా? ప్రేమ అనేది ఓసారి పుట్టి, ఓసారి చచ్చిపోడం ఏమిటీ? ఎప్పుడూ ఒకలా వుంటేనే అది ప్రేమ అనిపించుకుంటుంది కానీ.

## నటి ఉవాచ!

నాగరికత
నడిరోడ్డుమీద
నగ్నంగా తిరుగాడుతుంటే
నేను వేరేగా
ఎక్స్‌పోజింగ్ చేసేది
ఏముంది? ఏం మిగిలింది??

–జి.జి.కె. రావు

ఉద్యోగం చేసుకోడానికి కావల్సిన అర్హతలు నాకూ వున్నాయి. రేపో మాపో నాకూ ఉద్యోగం వస్తుంది. నేను ఆధారపడి వున్నాననే కదా రాంబాబుకి నామీద నిర్లక్ష్యం అనుకుని, కావాలని బాబు స్కూల్ వంకతో, అతడి మాట కాదంది.

తులసి ఓసారి వచ్చినప్పుడు అడిగింది.

"ఏమోయ్ లక్ష్మీ! ఇప్పుడు రాంబాబు దార్లోకి వచ్చాడా? మధు బాగా యాక్ట్ చేశాడు కదూ?" అంది నవ్వుతూ.

"ఏమిటీ? మధు యాక్ట్ చేశాడా? నిజం కాదా? నువ్వేసిన ప్లాన్ ఇదా? అంటే మధు కూడా, రాంబాబు లాటి వాడేనా?" అంటూ బోలెడు ప్రశ్నలు వేసింది.

"లేకపోతే...? అదంతా నిజం అనుకున్నావా? అయితే మీ ఇద్దరి మధ్యా సఖ్యత కుదర్చడానికి మాత్రం ఒప్పుకుని నేను చెప్పినట్టు చేశాడు అంతే!" అంది తులసి.

"అయితే తులసీ! అలాటి భర్తల్ని భరించాల్సిందేనా? వాళ్ళకి అనుగుణంగా ఛో... అంటే పోయి, రా... అంటే వచ్చీ, అభిమానం చంపుకుని బ్రతకాల్సిందేనా" అంది సుబ్బలక్ష్మి.

"అలా అని పిల్లల కోసం సర్దుకుపోవాలి అనుకో! అభిమానం చంపుకుని బ్రతకాలి అని కూడా అనను..." అంది తులసి.

"మరేమిటి నువ్వు చెప్పేది? కర్ర విరక్కుండా, పాము చావకుండా సలహా ఇచ్చావేమిటి?"

"వుండవోయ్. కోపగించకు మరి. కొద్దిరోజులు పిల్లల చదువుల బాధ్యత పూర్తయి, వాళ్ళని సెటిల్ అవనీ! ఆతర్వాత మన తడాఖా చూపిద్దాం" అంది తులసి.

"అంటే అంతదాకా నోరు మూసుకుని పడి వుండాలా?"

"వద్దు. ఉద్యోగంలో చేరు. ఎలాగా నీకూ, రాంబాబుకి ఎనిమిదేళ్ళు తేడా వుంది. అంటే, అతను రిటైర్ అయినా, నువ్వు ఉద్యోగం చేస్తుంటావు. అప్పుడు నువ్వు చెప్పినట్టు అతడు వినితీరాలి. పైగా అప్పుడు అతనికి నీ అవసరం ఎక్కువ, నిజానికి యాభై సంవత్సరాల వయసు నుంచీ మగవాడు మన మీద ఆధారపడటం మొదలుపెడతాడు. అర్థం అయిందా?" అంది తులసి.

"ఏమో! నీ సలహా అంతా అయోమయంగా వుంది. లైఫ్‌లో సగం గడిచిపోయాక సుఖపడేది ఏముంటుందీ డిపెండెంట్ గాని!" అంది సుబ్బలక్ష్మి.

"శుభా! ఈరోజు సాంబార్ అద్భుతంగా వుందోయ్" అన్నాడు రాంబాబు.

"ఇదిగో నా పేరు శుభ కాదు. శుభ్రంగా సుబ్బలక్ష్మి. లక్ష్మీ అనో, పూర్తి పేరుతోనో పిలవండి. శుభ పేరు నేనెందుకు మార్చుకోవాలి?" ఉద్యోగంలో చేరిన తర్వాత ధైర్యంగా చెప్పింది సుబ్బలక్ష్మి.

"అలాగే... మార్చుకోవద్దు. సుబ్బలక్ష్మి పేరుకేం చాలా బాగుంది శుభ పేరే బాగాలేదు సరే.. సరే.." అన్నాడు రాంబాబు, రాజీపడిపోయి.

"నా పేరు సరే బాగుంది. కానీ మీ పేరు రాంబాబు ఏమిటీ. నాకు నచ్చలేదు. షారూఖ్ అని పిలుస్తాను" అంది షారూఖ్ ఫ్యాన్ అయిన సుబ్బలక్ష్మి.

"అయ్య బాబోయ్! ఎంత నువ్వు షారూఖ్‌ఖాన్ ఫ్యాన్‌వయినా, నాకు బొత్తిగా సంబంధం లేని ముస్లిమ్‌ల పేరేమిటి లక్ష్మీ?" అన్నాడు రాంబాబు.

"అదంతే! మనకు అలాటి భేదభావం వుండకూడదు" అంది సుబ్బలక్ష్మి.

మరయితే నువ్వూ మార్చుకో... అన్లేదు రాంబాబు. ఇంకేం మార్చుకోమంటుందో అని!

అంతే! ఇంట్లో సుబ్బలక్ష్మి చేసే చాలా పన్లు, రాంబాబుకి బదలాయించబడ్డాయ్. కిక్కురుమనకుండా, ఎదురు చెప్పకుండా, భార్య చెప్పినట్టే వింటున్నాడు.

అయ్యో! మొదట్లో ఫోజు కొట్టకుండా, తిన్నగా వుండి వుంటే, ఈ పాట్లు తప్పేవి కదా? చేతులారా కొని తెచ్చుకున్నాను అనుకుంటాడు రాంబాబు ఉరఫ్ షారూఖ్.

"ఇప్పుడు జ్ఞానోదయం అయితే మాత్రం ఉపయోగం ఏముంది? చేసుకున్న వారికి చేసుకున్నంత!" ముసిముసిగా నవ్వుకుంది సుబ్బలక్ష్మి. ■